సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 4 । నవంబర్ । 2023

న్యూస్‌రీల్

శతశాతం ఫలితాలే లక్ష్యం



కురుపాం గిరిజన సంక్షేమ వసతిగృహంలో వంటకాలను పరిశీలిస్తున్న పీఓ విష్ణుచరణ్

కురుపాం: పదో తరగతిలో శతశాతం ఫలితాలే లక్ష్యంగా బోధన సాగించాలని ఉపాధ్యాయులకు పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతిగృహాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. వసతిగృహంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, బోధన, అభ్యాసం తదితర అంశాలపై ఆరా తీశారు. ఆహార పదార్థాల నాణ్యత, వంటగది శుభ్రతను పరిశీలించారు. గణితం, ఇంగ్లిష్, సైన్స్‌పై పట్టుసాధించాలని విద్యార్థులకు సూచించారు. సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఓతో పాటు వసతిగృహ సంక్షేమాధికారి సూర్యనారాయణ, హెచ్‌ఎం రామ గోవింద్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు

సాలూరు: విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు అన్నారు. సాలూరు మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ అడ్మిన్‌లతో శుక్రవారం సమావేశమయ్యారు. సచివాలయాల వారీగా సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఆస్తి, ఇంటి పన్నుల వసూలుపై దృష్టిసారించాలని సూచించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. డంపింగ్‌యార్డును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం, తదితరులు పాల్గొన్నారు.

తానా శాంతిసద్భావన యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ జక్కు రామకృష్ణ, తదితరులు

విజయనగరం టౌన్: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) శాంతి సద్భావన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం గురజాడ స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. శతశతక కర్త చిగురుమళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 100 దేశాల్లో శాంతి సద్భావన యాత్ర జరగనుందని జిల్లా సమన్వయకర్త చిన్నాదేవి తెలిపారు. ఈ నెల 9న ఆఫ్రికాలోని బోట్స్వానాలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం, వంద తెలుగు సంఘాల ఆధ్వర్యంలో యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా తానా వందే విశ్వమాతరం ఆధ్వర్యంలో డాక్టర్ జక్కు రామకృష్ణ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, గురజాడ ఇందిర, సోమేశ్వరరావు, అన్నపూర్ణ, మంజుల పారుపూడి, దశగ్రంథాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రయాలపై నిఘా



ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: మద్యం అక్రమ విక్రయాలపై నిఘా పెట్టాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు, ఇతర మార్గాల ద్వారా జిల్లాలోకి సారా, మద్యం ప్రవేశించే అవకాశం ఉందని, అటువంటి ప్రాంతాల పట్ల పర్యవేక్షణ పక్కాగా ఉండాలన్నారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని సారా తయారీ కేంద్రాలపై దాడులు ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ గోవిందరావు, అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్, ఎక్సైజ్ డీఎస్పీ సి.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలూ అధైర్యపడొద్దు

- మొసలికన్నీరు కార్చే ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు
- వర్షాభావంతో నష్టపోయిన పంటకు పరిహారం వస్తుంది
- ఉచిత పంటల బీమా పథకంతో ప్రభుత్వం ఆదుకుంటుంది
- గత నాలుగున్నరేళ్ల సేవలతో ప్రభుత్వంపై రైతుల్లో విశ్వాసం
- ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష
- సామాజిక సాధికార బస్సుయాత్రతో ప్రజలకు వైఎస్సార్‌సీపీ చేరువ
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

కరువు వచ్చేసిందంటూ రాజకీయాల కోసం మొసలికన్నీరు కార్చే ప్రతిపక్ష పార్టీల మాటలు నమ్మి అన్నదాతలెవ్వరూ అధైర్యపడవద్దని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని, రైతు సంక్షేమానికి ఎప్పుడూ కృషి చేస్తుందన్నారు. విజయనగరం జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగున్నరేళ్ల కాలంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా అందించిన సేవలు, సమృద్ధిగా వర్షాలతో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు. వరి పంట విషయానికొస్తే ఉమ్మడి విజయనగరం జిల్లాలో గత ఏడాది 2,31,391 ఎకరాల్లో సాగైతే ఈ సారి 2,31,831 ఎకరాలకు పెరిగిందన్నారు. అయితే, ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉంటాయని వాతావరణ నిపుణులు, శాస్త్రవేత్తల సూచనలతో కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే రైతులను అప్రమత్తం చేసిందన్నారు. గత ఏడాది వర్షాలతో డ్యాముల్లో ఉన్న నీటిని సాగు నీటి కాలువల ద్వారా అందించడం, తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ పథకం పక్కాగా కొనసాగించడంతో సగటున 9.3 శాతం లోటు వర్షపాతం ఉన్నా ఇప్పటివరకూ 4,839 ఎకరాల్లోనే వరి పంటకు నష్టం జరిగిందన్నారు. ఇదే వర్షాభావ పరిస్థితులు మరో వారం పది రోజులు కొనసాగితే ఈ నష్టం 25 వేల ఎకరాలకు పెరగవచ్చని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారని వివరించారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో తక్కువగానే నష్టం ఉందన్నారు. పంట నష్టపోయిన ప్రతీ రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. ఉచిత పంటల బీమా పథకం ద్వారా పంట నష్ట పరిహారం అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇవేవీ చెప్పకుండా కరువు వచ్చేసిందంటూ ప్రతిపక్ష పార్టీల నాయకులు కేవలం రాజకీయ లబ్ధి కోసం మొసలికన్నీరు కార్చుతున్నారని విమర్శించారు. వారి మాటలను నమ్మవద్దని, ప్రభుత్వం అన్నివిధాలా రైతులను ఆదుకుంటుందని తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయవంతంగా సిరిమానోత్సవం...

ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవంతో పాటు విజయనగరం ఉత్సవాలు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో విజయవంతం చేశారని మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రజలు ఆనందంగా తిలకించారని తెలిపారు.

బస్సు యాత్రతో ప్రజలకు చేరువ...

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్రతో అన్ని వర్గాల ప్రజలకు మరింత చేరువైందని మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. గజపతినగరం నియోజకవర్గంలో బస్సు యాత్ర విజయవంతమైందని అన్నారు. ఈ నెల 4న శృంగవరపుకోట నియోజకవర్గంలో, 8వ తేదీన సాలూరు నియోజకవర్గంలో జరుగుతుందని చెప్పారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అనూహ్యమైన స్పందన వస్తోందని జెడ్పీ చైర్మన్ చెప్పారు. జిల్లాలో 540 శిబిరాల నిర్వహణ లక్ష్యంకాగా ఇప్పటివరకు 510 విజయవంతమయ్యాయని వెల్లడించారు.

95 శాతం ప్రజలు సంతృప్తి...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పరిపాలన పట్ల 95 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని జెడ్పీ చైర్మన్ చెప్పారు.

అర్హత ఒక్కటే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్నారని వివరించారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం చేస్తున్నారని, బస్సుయాత్రలో అదే వివరిస్తున్నామని చెప్పారు.

గర్భస్థపిండ లింగ నిర్ధారణ నేరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గర్భస్థ పిండ లింగనిర్ధారణ చట్టం అమలు జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమన్నారు. చట్టాన్ని ఉల్లంఘించేవారికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తామన్నారు. లింగ నిర్ధారణ చేసేవారి వివరాలను టోల్‌ఫ్రీ నంబర్ 102, 104కు ఫోన్‌చేసి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డా.బి.జగన్నాథరావు, జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, అదనపు ఎస్పీ డా.ఒ.దిలీప్‌కిరణ్, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డా. బి.వాగ్దేవి, ఆర్‌బీఎస్‌కే ప్రాజెక్టు అధికారి డా. బి.భాస్కరరావు పాల్గొన్నారు.

ఎన్నికల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయండి

వచ్చే ఏడాది నిర్వహించనున్న సాధార ఎన్నికలకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎన్నికల ప్రధాన కార్యదర్శి ఎం.కె.మీన అన్నారు. సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అంశాలను పరిగణలోకి తీసుకొని పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ముందస్తు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. జిల్లాలోని నాలుగు శాసన సభ నియోజకవర్గాల్లో 1031 పోలింగ్ కేంద్రాలు, 154 రూట్లు, 154 సెక్టోరియల్ అధికారులు, పోలీస్ అధికారులు, 440 మైక్రో అబ్జర్వర్లను, 1750 మంది భద్రతా సిబ్బంది, 381 వాహనాలు అవసరమని అంచనా వేశామన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్‌బూత్‌లు గుర్తించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఆర్‌ఓ జె.వెంకటరావు, ఏఎస్పీ ఓ.దిలీప్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీని సందర్శించిన చాన్స్‌లర్

విజయనగరం అర్బన్: విజయనగరం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన చాన్స్‌లర్ మదన్‌లాల్ మీనా (విశ్రాంతి ఐఏఎస్) శుక్రవారం సందర్శించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కట్టిమణి ఆయనకు పుష్ప గుచ్ఛాన్ని ఇచ్చి స్వాగతం పలికారు. తొలుత వర్సిటీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం వివిధ విభాగాలు, ప్రయోగశాలలను సందర్శించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసన్ విశ్వవిద్యాలయ వివరాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చాన్స్‌లర్‌కు వివరించారు. బోధన సిబ్బందితో మీనా మాట్లాడారు. బోధన, పరిశోధన, పరిపాలనా పరమైన వివిధ అంశాలను తెలుసుకుని పలుసూచనలు చేశారు. వర్సిటీలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

కార్యక్రమంలో వర్సిటీ డీన్ ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు, ప్రొఫెసర్ జితేంద్రమోహన్‌మిశ్ర, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కివాడే, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా ఉత్పత్తులకు అపూర్వ ఆదరణ



హ్యాండీ క్రాఫ్ట్ ఉత్పత్తుల విక్రయశాల

- ఆకర్షిస్తున్న అఖిల భారత డ్వాక్రా బజార్
- ప్రదర్శన, విక్రయాలకు 18 రాష్ట్రాలకు చెందిన 251 స్టాల్స్
- హస్తకళలు, వస్త్రాలు, అలంకార వస్తు ప్రదర్శన
- ఆరు రోజుల్లో రూ.2.80 కోట్ల వ్యాపారం

విజయనగరం అర్బన్: విజయనగరం ట్యాంకు బండ్ రోడ్డును ఆనుకుని మాన్సాస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన అఖిల భారత డ్వాక్రా బజార్‌కు కొనుగోలుదారుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలు, రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళల తయారు చేసిన నాణ్యమైన ఉత్పత్తులను 251 స్టాల్స్‌లో ప్రదర్శనకు ఉంచారు. గృహాలంకరణ వస్తువులు, కలంకారీ, కాటన్ చీరలు, చేనేత, ఖాదీ వస్త్రాలు, చెక్కబొమ్మలు, అలంకార వస్తువులు చూపరులను ఆకర్షిస్తున్నాయి. జూట్‌తో తయారు చేసిన జూట్ బ్యాగ్‌లు, నోరూరించే వివిధ ప్రాంతాల సంప్రదాయ తినుబండారాలు, జెనరిక్ ఔషధాలు, సుగంధాలు తదితర సకల ఉత్పత్తులు అఖిల భారత డ్వాక్రా బజార్‌లో లభిస్తున్నాయి. ఆరు రోజుల్లో రూ.2.80 కోట్ల లావాదేవీలు జరిగాయి. ఈ నెల 8 వరకు ఉత్పత్తుల విక్రయం కొనసాగనుంది. మరోవైపు మైదానంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు చిన్నారులను అలరిస్తున్నాయి.

ప్రదర్శన వస్తువులు ఇవే

ఎగ్జిబిషన్‌లో వెదురు ఉత్పత్తులు, వస్త్ర ఉత్పత్తులు, చీరలు, జ్యూవెలరీ, హ్యాండ్‌లూమ్, డ్రై ఫ్లవర్స్, హ్యాండీ క్రాఫ్ట్, బెడ్‌షీట్స్, గృహాలంకరణ వస్తువులు, కుర్తాలు, రెడీమేడ్ దుస్తులు, ఆభరణాలు, మసాలా దినుసులు, కార్పెట్లు, డ్రైఫ్రూట్స్, ఆర్టిఫీషియల్ జ్యూవెలరీ, జ్యూట్ డోర్ ఉత్పత్తులు, పోచంపల్లి, గద్వాల్ వస్త్రాలు అందుబాటు ధరల్లో లభిస్తున్నాయి.



జూట్‌తో తయారు చేసిన ఆకర్షణీయమైన గృహాలంకరణ సామగ్రి

అరుదైన ఉత్పత్తులు

విజయనగరం అర్బన్: పట్టణంలో నిర్వహిస్తున్న అఖిల భారత డ్వాక్రా బజార్‌లో రాష్ట్రేతర ఉత్పత్తులు ప్రదర్శనలో ఉన్నాయని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి తెలిపారు. ప్రదర్శన ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 28 నుంచి నిర్వహిస్తున్న వస్తు ప్రదర్శనలో 18 రాష్ట్రాలకు చెందిన పలువురు పొదుపు మహిళల ఉత్పత్తులతో కూడిన స్టాల్స్ ఉన్నాయన్నారు. నాణ్యమైన, అరుదైన వస్తువులు కొనుగోలుచేయాలనుకునే వారు డ్వాక్రా బజార్‌ను సందర్శించాలన్నారు. గ్రామీణ మహిళల హస్తకళా ఉత్పత్తుల విక్రయాన్ని ప్రోత్సహించడం, వాటికి ప్రాచుర్యం కల్పించడమే ముఖ్య ఉద్దేశంగా కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ పదర్శన నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. సమావేశంలో సమాచార శాఖ ఏడీ డి.రమేష్, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి

సమస్యల సత్వరపరిష్కారానికి
‘జగనన్నకు చెబుదాం’



వినతులు స్వీకరిస్తున్న జేసీ గోవిందరావు, ఆర్డీవో లావణ్య

- జేసీ గోవిందరావు
- 159 అర్జీల స్వీకరణ

సీతంపేట: ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి గోవిందరావు తెలిపారు. సీతంపేట ఐటీడీఏలోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పాలకొండ ఆర్డీఓ లావణ్య, జిల్లా అధికారులతో కలిసి జేసీ ప్రజల నుంచి 159 అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి తమ నియోజకవర్గంలో ఉన్న వివిధ సమస్యలపై తమ ప్రతినిధులతో వినతులు అందజేశారు. అర్జీలలో కొన్ని..

- గిరిజన గ్రామాల్లో రహదారులు, వరదగోడలు నిర్మించాలని, విద్యుత్, మంచినీటి సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ బి.ఆదినారాయణతో పాటు పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వినతులు ఇచ్చారు.
- బొంగుడుగూడ, పెద్దూరు, వలగెడ్డవీధి, వలసగూడ, దాసరిగూడ, పెద్దగూడ గ్రామాలకు సీసీ రోడ్లు, కాలువలు మంజూరు చేయాలని పెద్దూరు, కొత్తగూడ సర్పంచ్‌లు హిమరక ఆదిలక్ష్మి, సవర సుశీల వినతిపత్రం అందజేశారు.
- మర్రిపాడు–పూతకవలస ప్రధాన రహదారి మరమ్మతులు చేపట్టాలని ఎస్.సుభాష్ వినతి ఇచ్చారు. అవసరమైన చోట చెక్‌డ్యామ్‌లు నిర్మించాలన్నారు.
- మొగదారగూడలో రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మించాలని, అప్రోచ్‌రోడ్డు, సీసీ రోడ్లు, కొత్త డ్రైనేజీ ఏర్పాటు చేయాలని మర్రిపాడుకు చెందిన వూయక చలపతిరావు కోరారు.
- ఏజెన్సీలో పనిచేస్తున్న సుమారు 200ల మంది సచివాలయ ఉద్యోగులకు ఏజెన్సీ అలవెన్సులు ఇప్పించాలని సచివాలయ సిబ్బంది కె.చిరంజీవి వినతిపత్రం అందజేశారు.
- చిన్నపల్లంకి, పెద్దపల్లంకి గ్రామాల్లో 15 మంది చిన్నారులు ఉన్నారని, వారికి అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని ఎ.రామ్మూర్తి విన్నవించారు.
- అటవీశాఖ పరిధిలోని 22 కుటుంబాలకు డీ పట్టాలు ఇప్పించాలని బర్నగూడకు చెందిన చిన్నారావు వినతిపత్రం అందజేశారు.

కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, తహసీల్దార్ ఎస్.నరసింహమూర్తి, ఎంపీడీఓ కె.గీతాంజలి, డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు, డుమా పీడీ రామచంద్రరావు, జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ, డీహెచ్‌ఓ సత్యనారాయణ రెడ్డి, ఈఈ సింహాచలం, జీసీసీ డీఎం సంధ్యారాణి, ఐసీడీఎస్ పీడీ ఎం.ఎల్.రాణి, గిరిజన సంక్షేమశాఖ డీడీలు శ్రీనివాసరావు, మంగవేణి, బీసీ సంక్షేమాధికారి ఎస్.కృష్ణ, ముఖ్య ప్రణాళికాధికారి వీర్రాజు, డీఎస్‌ఓ సూర్యారావు, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై ఫిర్యాదు



జగనన్నకు చెబుదాం మంచి కార్యక్రమం. మా ప్రాంతంలో నళిని కృష్ణసాగరం చెరువు ఆక్రమణకు గురైంది. సాగునీటి నిల్వ సామర్థ్యం తగ్గి ఆయకట్టుకు సరిగా నీరు అందడం లేదు. సమస్యను పరిష్కరించాలని జేసీకు గ్రామస్తులతో కలిసి విన్నవించాం.

– ఎర్రయ్య, చిన్నబగ్గ కాలనీ

విద్యుత్ సమస్యపై ఫిర్యాదు



మా గ్రామంలో విద్యుత్ స్తంభాలన్నీ పాతబడిపోయాయి. కొత్తవి వేయాలని వినతి ఇచ్చాను. వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని కోరాం. సమస్య పరిష్కరిస్తామని జేసీ చెప్పారు. విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు.

– సవర నారాయణ, అడ్డంగి

1371 మందికి వైద్యం

జిల్లాలో జేఏఎస్ శిబిరాల్లో శుక్రవారం అందించిన వైద్యసేవలు ఇలా...	
మండలాలు	15
వైద్యశిబిరాలు	3
ఓపీలు	1370
స్పెషలిస్టు ఓపీలు	775
సాధారణ ఓపీలు	596
డీఎం	135
హెచ్‌టీఎన్	284
ఏఎన్‌సీ	40
పీఎన్‌సీ	8
ఎనీమియా	58
ల్యాబ్ టెస్టులు	1256
ఈసీజీ పరీక్షలు	25
రిఫరల్ కేసులు	6

పార్వతీపురం టౌన్: జిల్లాలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో 1371 మందికి వైద్య సేవలు అందించినట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. స్థానిక వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జేఏఎస్ శిబిరాలు నిర్వహించి ప్రజలకు ఆరోగ్యభరోసా కల్పిస్తోందన్నారు. మెరుగైన వైద్యం అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నట్టు వెల్లడించారు. జిల్లాలోని మర్రిపాడు పీహెచ్‌సీ పరిధిలోని తూతికపాయి ఎంపీపీ స్కూల్, జియ్యమ్మవలస పీహెచ్‌సీ పరిధిలోని గెడ్డ తిరువాడ విలేజ్ క్లినిక్‌లో శనివారం జేఏఎస్ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

9న వైటీసీలో జాబ్‌మేళా

సీతంపేట: స్థానిక వైటీసీలో ఈ నెల 9న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు శ్రీసిటీలో క్యాడ్‌బరీ చాక్లెట్ తయారు చేసే ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ మొండేలేజ్ ఇండియా లిమిటెడ్‌లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరగనున్నాయన్నారు. ఇంటర్మీడియట్ ఆపైన చదివిన వారు ఇంటర్వ్యూలకు అర్హులని స్పష్టం చేశారు. ఎంపికై న వారికి నెలకు రూ.17,500లు వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9150015264 నంబర్‌లో సంప్రదించి దరఖాస్తు చేయాలని సూచించారు.

ఉపాధ్యాయురాలి మెడలో గొలుసు చోరీ

జామి: మండలంలోని లొట్లపల్లి జెడ్పీఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా చేస్తున్న కె.అరుణకుమారి మెడలోని బంగారం గొలుసు చోరీకి గురైంది. ఆమె ఎప్పటిలాగానే శుక్రవారం విజయగనరం నుంచి స్కూటీపై పాఠశాలకు వస్తున్న సమయంలో లొట్లపల్లి సిమెంట్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద విజయనగరం నుంచి కొత్తవలస వెళ్లే ప్రధానరహదారిపై ఆమె వెనుకనుంచి మాస్కులు ధరించిన ఇద్దరు యువకులు పల్సర్ బైక్‌పై వచ్చి మెడలో ఉన్న 2తులాల బంగారం చైన్‌ను తెంపివేసి భీమసింగి వైపు పరారయ్యారు. ఈ ఘటన నుంచి ఉపాధ్యాయురాలు తేరుకుని పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై వీరబాబు ఘటనా స్థలానికి వచ్చి జరిగిన ఘటనపై ఆరాతీశారు. బ్లాక్ కలర్ పల్సర్ బైక్‌పై ఇద్దరు దుండగులు వచ్చారని ఉపాధ్యాయురాలు ఎస్సైకి తెలియజేశారు. ఈ మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేపడతామని ఎస్సై తెలిపారు.

డాక్టర్‌పై దాడి కేసులో మరో నిందితుడి అరెస్ట్

విజయనగరం క్రైమ్: ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్న సువర్ణ కుమార్‌పై దాడికి పాల్పడిన కేసులో మరో నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు శుక్రవారం తెలిపారు. దర్యాప్తులో భాగంగా విశాఖలోని రవీంద్రనగర్‌కు చెందిన ఎదువాక హరికుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

బాల్‌బ్యాడ్మింటన్ చీఫ్ రిఫరీగా అజయ్


పి.అజయ్‌కుమార్

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ పి.అజయ్‌కుమార్ నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరగనున్న అండర్ 14, 16,19 బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు చీఫ్ రిఫరీగా ఎంపికయ్యారని హెచ్ఎం శాసపు సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఈ నెల 4 నుంచి 6 వరకు బాల్‌బ్యాడ్మింటన్ స్కూల్‌గేమ్స్ బాలికల పోటీలు జరగనున్నాయని అన్నారు. ఆయన ఎంపికపట్ల హెచ్ఎంతోపాటు ఇతర ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

5న బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

తెర్లాం: రాష్ట్రస్థాయి సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు సంబంధించి బాలురు, బాలికల విభాగంలో జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 5న ఆదివారం తెర్లాం మండలంలోని నెమలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరగనుంది. ఈ మేరకు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయకుమార్, శ్రీధర్, సుందరరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురంలో డిసెంబర్ 8,9,10తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేస్తామని, ఆసక్తి గల బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులంతా ఆదివారం ఉదయం 9గంటలకు హాజరుకావాలని కోరారు. జిల్లా జట్ల ఎంపికలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసరావు, నెమలాం పీడీ సింహాచలం పాల్గొంటారని తెలియ జేశారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల స్వాధీనం


పోలీసుల తనిఖీలో పట్టుబడిన పశువులు

దత్తిరాజేరు: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కబేళాలకు తరలిస్తున్న 16 పశువులను, రెండు వ్యాన్లను స్వాధీనం చేసుకున్నట్లు పెదమానాపురం ఎస్సై శిరీష తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె మాట్లాడుతూ పార్వతీపురం నుంచి అలమండకు అనుమతులు లేకుండా పరిమితికి మించి పశువులను తరలిస్తున్నారన్న మందస్తు సమాచారం మేరకు పెదమానాపురం వద్ద సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టి పశువులు తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నామన్నారు. ఈ మేరకు పశువుల యజమానులు, వాహనాల డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థినులకు 'స్వేచ్ఛ'తో భరోసా

- ప్రభుత్వ పాఠశాలల్లో పథకం అమలు
- 6 నుంచి10వ తరగతి విద్యార్థినులకు ఉచితంగా న్యాప్‌కిన్ల పంపిణీ
- హర్షం వ్యక్తంచేస్తున్న తల్లిదండ్రులు


విద్యార్థినులకు న్యాప్‌కిన్స్‌పై అవగాహన కల్పిస్తున్న సైన్స్‌టీచర్స్

రామభద్రపురం: విద్య విషయమే కాకుండా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఈ మేరకు పాఠశాలల్లోని విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయడంతో పాటు వారి సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. అందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల డ్రాపవుట్స్ తగ్గించేందుకు ఉచితంగా విద్యతో పాటు, వైద్యం, ఆరోగ్యానికి వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తూ వారి విద్యాభ్యాసాన్ని ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల డ్రాపవుట్స్ తగ్గించేందుకు బాలికలకు స్వేచ్ఛ పథకం కింద శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీ చేస్తోంది. పాఠశాలల్లో కిశోరీ బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం స్వేచ్ఛ పథకాన్ని అమలు చేస్తోంది.6 వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు చదువుతున్న బాలికలకు న్యాప్‌కిన్లు పంపిణీ చేస్తోంది. బాలికలు రుతుక్రమ సమయంలో ఇబ్బందులు ఎదర్కోవడం పాఠశాలల్లో డ్రాపవుట్స్‌కు కారణమవుతోంది. దీన్ని నివారించేందుకు ఈ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే కిశోరీ బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది అక్టోబరు 5వ తేదీన ప్రారంభించారు.అలాగే ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న అందరి విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ పాఠశాలల్లో వైద్యశిబిరాల నిర్వహిస్తూ వైద్యపరీక్షలు చేయిస్తోంది. బాలికా విద్యకు ఆటంకం కలగకూడదని,వారు అనారోగ్యం పాలవకూడదన్న ఉద్దేశంతో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు అవసరమైన న్యాప్‌కిన్లు సరఫరా చేస్తున్నారు. జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6 వ తరగతి చదువుతున్న బాలికలు 12,421, 7వ తరగతిలో 12,469, 8వ తరగతిలో 12,007, 9వ తరగతిలో 12,006,10 మంది చదువుతున్నారు. వారికి ప్రతి ఏడాది అవసరమైన శానిటరీ న్యాప్‌కిన్లు ప్రభుత్వం అందజేస్తోంది. దీంతో విద్యార్థినులు వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.


పాఠశాలలకు న్యాప్‌కిన్ బాక్సులు సరఫరా చేస్తున్న ఏజెంట్ నాగరాజు

విద్యార్థినులకు తప్పిన ఇబ్బందులు



ప్రభుత్వం నాప్‌కిన్లు సరఫరాచేయడం వలన కౌమార దశలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తప్పాయి. రుతుక్రమ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేస్తున్నాం. విద్యార్థినుల్లో అవగాహన పెరిగింది. ప్రభుత్వం విద్యార్థులకు వైద్యం, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం సంతోషకర పరిణామం. విద్యార్థినుల హాజరుశాతం పెరుగుతోంది.

రమాదేవి, సైన్స్ టీచర్

ఉచితంగా న్యాపికిన్స్ ప్యాడ్స్



ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న కిశోరీ బాలికలకు ఉచితంగా న్యాప్‌కిన్స్, ప్యాడ్స్ అందిస్తున్నాం.సైన్స్ ఉపాధ్యాయినులు రుతుక్రమంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం స్వేచ్ఛ పథకం అమలు చేస్తుండడంతో బాలికల హాజరు శాతం పెరిగింది.

బి.లింగేశ్వరరెడ్డి, డీఈవో, విజయనగరం

వినతుల పరిష్కారానికి తక్షణ చర్యలు

- జేసీ కె.మయూర్ అశోక్
- వంగరలో స్పందన కార్యక్రమం


వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్


ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న వివిధ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు

వంగర: సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ వెల్లడించారు. ఈ మేరకు వంగర మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమానికి ఆయన హాజరై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావులు మర్యాదపూర్వకంగా కలుసుకున్న అనంతరం పలువురు సచివాలయ ఉద్యోగులు జేసీకి పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం వివిధ గ్రామాల ప్రజలు సమర్పించిన 64 వినతులను జేసీ స్వీకరించారు. కొత్తగా గృహాలు మంజూరు చేయాలని 16 వినతులు, ఇళ్ల నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని 21 వినతులు అందజేశారు.

శివారు గ్రామాలకు సాగునీరు అందాలి

భూముల సర్వేతోపాటు భూ సమస్యలపై ఆరు వినతులను జేసి స్వీకరించారు. బంగారువలస–విశాఖపట్నం నైట్‌హాల్ట్ పునరుద్ధరించాలని, వంగరలోని వివిధ గ్రామాలనుంచి రాజాం పట్టణానికి బస్సు సౌకర్యం కల్పించాలని వినతులందజేశారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా వంగర మండలంలోని శివారు గ్రామాలకు సాగునీరందడం లేదని మద్దివలస, ఎం.సీతారాంపురం గ్రామాలకు చెందిన రైతులు వినతులు అందజేశారు. కార్యక్రమంలో చీపురుపల్లి ఆర్డీవో బి.శాంతి, జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ విశ్వేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి నూకరాజు, వ్యవసాయశాఖ ఎ.డి బి.టి.రామారావు, డ్వామా ఏపీడీ ఎం.శ్రీనివాసరావు, వెటర్నరీ ఏపీడీలు బొత్స జయప్రకాశ్, తిరుపతిరావు, సోషల్ వెల్ఫేర్ అధికారి డీవీ సత్యనారాయణ, హౌసింగ్ డీఈ మురళి, ఎంపీడీవో హెచ్.శశిభూషణరావు, డీటీ బూరాడ సుందరరావు, ఏవో లోపింటి త్రినాథ్, ఈవోపీఆర్‌డీ గొబ్బూరు విజయ్‌కుమార్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

విజయనగరం అర్బన్: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ వెల్లడించారు. వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమాదేశంలో పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రతి జిన్నింగ్ మిల్లును పత్తి కొనుగోలు కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా ఫైర్ ఆఫీసర్, ట్రాన్స్‌పోర్ట్ అధికారి, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, సీసీఐ బయ్యర్, కార్యదర్శి వ్యవసాయ మార్కెట్ కమిటీ, జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒక్క ఫోన్ కొడితే వచ్చి తాట తీస్తాం

- దిశ డీఎస్పీ హర్షిత
- జిల్లా వ్యాప్తంగా యాప్ స్పెషల్ డ్రైవ్


పట్టణంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో దిశ యాప్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ హర్షిత


నర్సిపురం ఎస్‌వీసీ థియేటర్లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించిన డీఎస్పీ హర్షిత

పార్వతీపురంటౌన్: మహిళలను ఆకతాయిల నుంచి రక్షించేందుకు దిశ యాప్ ఉపయోగపడుతుందని, ఒక ఎస్ఓఎస్ ఫోన్ కొడితే చాలునని, వచ్చి ఆకతాయిల తాటతీస్తామని దిశ డీఎస్పీ హర్షిత స్పష్టం చేశారు. ఈ మేరకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు శుక్రవారం పార్వతీపురం జిల్లావ్యాప్తంగా దిశయాప్ స్పెషల్ డ్రైవ్ నిర్వహణలో భాగంగా పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పార్కులు, సినిమా థియేటర్ల వద్ద మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులపై లైంగిక వేధింపులు, దాడులు జరగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం దిశ యాప్‌ను ప్రత్యేకంగా రూపొందించిందన్నారు. ప్రతి ఒక్కరి మొబైల్ ఫోన్‌లో దిశయాప్ ఉండాలని, ఆపద సమయాల్లో దాన్ని ఉపయోగించి పోలీసుల సహకారం పొందాలని కోరారు. ఈ యాప్ మహిళలకు వజ్రాయుధం లాంటిదని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ జి.మురళీధర్, పట్టణ సీఐ కృష్ణారావు, ఎస్సై దినకర్, సిబ్బంది పాల్గొన్నారు.

జేఏఎస్‌లో రిఫర్ చేసిన వారిని రప్పించాలి

- ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ అప్పలరాజు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అప్పలరాజు

విజయనగరం ఫోర్ట్:

జిల్లాలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష(జేఏఎస్) వైద్య శిబిరాల్లో శస్త్రచికిత్సలు, వివిధ రకాల చికిత్సలు అవసరమైన వారికి ఫోన్ చేసి వారిని రప్పించి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చికిత్స అందేలా చూడాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ఆరోగ్యశ్రీ కార్యాలయంలో టీమ్ లీడర్లతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష శిబిరాల్లో రిఫర్ చీటీలతో వచ్చే రోగులకు వైద్యులు సూచించిన సేవలు అందేలా చూడాలన్నారు. ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులను ప్రతిరోజూ పర్యవేక్షించాలని చెప్పారు. సమావేశంలో టీమ్ లీడర్లు తుంపల్లి జనార్దనరావు, భాను, రాయవరపు ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 సాఫ్ట్‌బాల్ జిల్లా జట్లు సిద్ధం


సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్లు

- 10 నుంచి గుంటూరు జిల్లా బాపట్లలో పోటీలు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 బాల, బాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు శుక్రవారం ముగిశాయి. అండర్-19 స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో నిర్వహించిన ఎంపికలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మంది బాలురు, 16 మంది బాలికలను జిల్లా జట్లకు ఎంపిక చేశారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 10,11,12 తేదీల్లో గంటూరు జిల్లా బాపట్లలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీల్లో విజయనగరం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు పీవీఎల్ఎన్ కృష్ణ తెలిపారు. ఈ ఎంపిక పోటీలను పలువురు వ్యాయామ అధ్యాపకులు, కోచ్‌లు పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రామభద్రపురం విద్యార్థులు


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం కె కామేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు

రామభద్రపురం: ఎస్.కోటలో గత నెల 26వ తేదీన జిల్లా స్థాయిలో నిర్వహించిన స్కూల్‌గేమ్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రామభద్రపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు వ్యాయామ ఉపాధ్యాయులు డి శ్రీదేవి, బి. వెంకటరావు తెలిపారు.జిల్లా స్థాయి పోటీలలో అండర్ 14 విభాగంలో ఎస్.రేవంత్, అండర్ 17 విభాగంలో ఎస్.మేఘనాథ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు ఎంపికై న ఈ విద్యార్థులు హాజరవుతురని చెప్పారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను పాఠశాల హెచ్ఎం కె.కామేశ్వరరావుతో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

యువకుడి ఆత్మహత్య



పార్వతీపురంటౌన్: పట్టణంలోని కొత్తవలసలో ఓ యువకుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పార్వతీపురం పట్టణ ఎస్సై నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తవలసకు చెందిన దుప్పలపూడి సునీల్(21) షార్ట్‌ఫిల్మ్‌లో నటుడిగా, డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. తనకు షార్ట్ ఫిల్మ్ నిమిత్తం రూ.50వేలు అవసరమని తల్లిని అడిగాడు. ఈ మేరకు తల్లి డబ్బులు ఇవ్వనని చెప్పడంతో మనస్తాపానికి గురై గురువారం అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. మృతుడి తల్లి సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించామని చెప్పారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹100	₹170	₹180

గంజాయి, సారాతో పట్టుబడితే పీడీ యాక్ట్ నమోదు

- ఎస్ఈబీ అడిషినల్ ఎస్పీ ఎస్.వెంకటరావు


ఎస్ఈబీ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న అడిషినల్ ఎస్పీ వెంకటరావు

కొత్తవలస: నిషేధిత గంజాయి, సారా తయారీ, తరలింపు చేస్తుండగా పట్టుబడిన వ్యక్తులపై పీడీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) అడిషినల్ ఎస్పీ ఎస్.వెంకటరావు హెచ్చరించారు. ఈ మేరకు మండల కేంద్రంలో గల ఎస్ఈబీ పోలీస్‌స్టేషన్‌కు వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిషేధిత గంజాయి, సారా తరలింపుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. మాదక ద్రవ్యాల వినయోగం వల్ల తలెత్తే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సారా తయారీ, రవాణా నియంత్రణకు పరివర్తన కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రాజేశ్వరి, ఎస్సై పి.నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకపత్రం అందజేత


రిష్యంద్రకు కారుణ్య నియామక పత్రాన్ని అందిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: హిందీ ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న బవిరిపూడి రోహిణి ఇటీవల మరణించడంతో ఆమె కుమారుడు రిష్యంద్రను భోగాపురం ఎంపీడీవో కార్యాలయంలో సహాయకుడిగా నియమిస్తూ జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం కారుణ్య నియామక పత్రాన్ని అందించారు. బాడంగి మండలం కోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా రోహిణి పని చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్, డీఎల్‌డీవో నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల నిర్ణయం హర్షణీయం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు



మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్

విజయనగరం రూరల్: రాష్ట్రంలో పనిచేస్తున్న అక్రిడేటెడ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలను ఇవ్వాలని నిర్ణయం తీసుకున్న రాష్ట్ర మంత్రి మండలి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలోని లోపాలను ఎత్తి చూపి, దిశానిర్దేశం చేసే జర్నలిస్టులు, వ్యక్తిగతంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, వారి కష్టాలను గుర్తించిన ముఖ్యమంత్రి వారికి కూడా సొంత ఇంటి భాగ్యాన్ని కల్పించేందుకు నిర్ణయించడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగూ జర్నలిస్టులకు అభినందనలు తెలిపారు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

విజయనగరం అర్బన్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ పేర్కొంది. ఈ మేరకు కమిటీ రాష్ట్ర కార్యదర్శి పీవీఎస్‌ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు అల్లు సూరిబాబు, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఎన్‌రాజులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గత ప్రభుత్వాలపై అనేక పోరాటాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖరరెడ్డి హయంలో హౌసింగ్ సొసైటీ ప్రాతిపదికన ఇళ్ల స్థలాలు ఇచ్చారని గుర్తు చేశారు.

జగన్నాథుడికి నూతన రథం


రథాన్ని తయారుచేసే వ్యక్తికి చెక్ అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం టౌన్: దేవదాయశాఖ, నా ఊరు విజయనగరం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దాసన్నపేటలోని జగన్నాథ స్వామికి నూతన రథం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మజ్జి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం నా ఊరు విజయనగరం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు విశాల మాట్లాడుతూ, జగన్నాథస్వామికి కొత్త రథం నిర్మిస్తున్నామని, వచ్చే ఏడాది రథయాత్ర కొత్త రథంలో వైభవంగా నిర్వహిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థ ద్వారా సేకరించిన 5 లక్షల రూపాయల్లో రెండు లక్షల రూపాయలను రథం తయారుచేసేవారికి ముఖ్య అతిథుల చేతులమీదుగా అందజేశారు. ఈఓ సుధారాణి మాట్లాడుతూ, ప్రభుత్వం తరపున తగు సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాపుగంటి ప్రకాష్, సభ్యులు రవి, త్రినాథ్, రామదాసు, తదితరులు పాల్గొన్నారు.